● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



గార : శాలిహుండాం బౌద్ధక్షేత్రంలో స్థూపాలు, చైత్యాలు

సిక్కోలు.. సొబగులు

● జిల్లాలో పర్యాటక ప్రాంతాలెన్నో..

సిక్కోలు.. పర్యాటక అందాలకు నెలవు. చుట్టూ పచ్చటి కొండలు.. సువిశాల సాగరతీరం.. విదేశీ పక్షుల విడిది కేంద్రం.. ఆహ్లాదనిచ్చే జలపాతాలు.. కట్టిపడేసే ఏజెన్సీ అందాలు అన్నీ ఇన్నీ కావు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు.. దశాబ్దాల కిందట నిర్మించిన చారిత్రాత్మిక కట్టడాలు.. బౌద్ధక్షేత్రాలు.. బారువ తీరాన లైట్‌హౌస్, కాటేజీలు, ఎత్తయిన ఇసుక దిబ్బలు.. ఇలా పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. కాగా ఇంతవరకు పర్యాటకశాఖ వీటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరకొరగా సౌకర్యాలు కారణంగా.. పలు ప్రదేశాలు పర్యాటకుల తాకిడి లేక కళావిహీనంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శుక్రవారం 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా.. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు.. వాటి ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర కథనాలు.. 7లో



సోంపేట : బారువ తీరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న లైట్‌హౌస్

తిరుపతికి.. పలాస జీడిపప్పు

● తొలిసారిగా 30 టన్నుల తరలింపు

పలాస, సెప్టెంబరు 26: తిరుమల తిరుపతి దేవస్థానానికి పలాస నుంచి జీడిపప్పును గురువా రం మధ్యాహ్నం పంపించారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జీడిపప్పు వినియో గానికి సంబంధించి పలాస వ్యాపారి కోరాడ సంతోష్‌కుమార్ ఇటీవల బిడ్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలిసారిగా 30 టన్నుల జేహెచ్(బద్ద) రకం జీడిపప్పును సిద్ధం చేశారు. ఓ లారీని సుందరంగా పూలదండలతో అలంకరించి.. దానికి గరుడ వాహనంగా నామకరణం చేశారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మె ల్యే గౌతు శిరీష జెండా ఊపి.. జీడిపప్పు లోడుతో ఆ వాహనాన్ని తిరుపతికి పంపించారు. ముందుగా వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. జీడి కార్మికులు, వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొని లారీని గోవిందనామ స్మరణతో సాగనంపారు. మంత్రులు, ఎమ్మెల్యే మాట్లాడుతూ పలాస జీడి పప్పును తిరుపతి బాలాజీ లడ్డూలో వినియోగించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో పలాస ఖ్యాతి ప్రపంచ వ్యాప్తం కావాలని ఆకాంక్షించారు. ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ ఆగ్రోస్ సంస్థ చైర్మన్ కోరాడ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. వెంకటేశ్వరస్వామి తనకు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నా మని, నాణ్యతలో రాజీ లేకుండా, భక్తిశ్రద్ధలతో జీడిపప్పు తయారు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అడ్వయిజర్ అంధవరపు రతన్‌బాబు, పీవీ.సతీష్‌కుమార్, పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, పీరుకట్ల విఠల్‌రావు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర(చిన్ని), గాలి కృష్ణారావు పాల్గొన్నారు.



జీడిపప్పు లారీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష

నీటిపారుదల శాఖలో బదిలీలు


శ్రీకాకుళం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ(జల వనరులు)లో గురువారం రాష్ట్రవ్యాప్తంగా కీలక అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో భాగంగా పార్వతీపురం ఇరిగేషన్ డివిజన్‌లో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాన అప్పలనాయుడును శ్రీకాకుళం డివిజన్‌కు నియమించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఉత్తర్వులను జారీచేశారు.

బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం క్రైం/ కలెక్టరేట్, సెప్టెంబరు 26: జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీకాంత్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు ఎక్సైజ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. అలాగే భూగర్భ గనులశాఖ డీడీగా సి.మోహనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో విజయవాడ కమిషనరేట్‌లో పని చేసి.. బదిలీపై జిల్లాకు వచ్చారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 26: విభిన్న ప్రతిభావంతుల స్వాభిమాన్ ప్రత్యేక గ్రీవెన్స్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వినతులు స్వీకరణ జరుగుతుందన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఉపాధ్యాయుడిగా మారి..

పాఠశాల తనిఖీ సందర్భంగా మంత్రి లోకేశ్ ఉపాధ్యాయుడి అవతారమెత్తి విద్యార్థుల ఐక్యూ టెస్ట్ చేశారు. పలు వస్తువుల పేర్లను ఇంగ్లీషులో అడిగి తెలుగులో సమాధానాలు రాబట్టారు. చిన్నారులు హుషారుగా సమాధానాలివ్వడంతో మంత్రి లోకేష్ ఆనందం వ్యక్తంచేశారు. అబ్బాయిలు క్లాస్‌రూమ్ తలుపు విరగ్గొట్టారని ఒక బాలిక చెప్పడంతో.. మీరు రౌడీల మాదిరి ఉన్నారురా అంటూ సరదాగా వారితో చమత్కరించారు. చిన్నప్పుడు తాను కూడా అల్లరి చేసేవాడినని చెప్పారు. విద్యార్థులకు ఏమికావాలని అడగ్గా.. బెంచీలు అవసరమని చెప్పడంతో త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఎచ్చెర్లవీధి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



ప్రతీ తరగతికీ ఒక టీచర్

● వచ్చే ఏడాది నుంచి అమలు
● ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
● పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
● అందరి భాగస్వామ్యంతో విద్యా ప్రమాణాలు పెంపు
● మంత్రి నారా లోకేశ్
● శ్రీకాకుళంలో ప్రాథమిక పాఠశాల తనిఖీ

శ్రీకాకుళం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వచ్చే ఏడాది నుంచి ప్రతీ తరగతికీ ఒక టీచర్ ఉండే విధానాన్ని అమలు చేస్తామ'ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గురువారం శ్రీకాకుళం నగరం.. 'ఎచ్చెర్లవీధి'లోని ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. బోధనపై ఆరా తీశారు. ఇష్టమైన సబ్జెక్టు ఏమిటని అడగ్గా.. ఇంగ్లీషు, ఈవీఎస్ అని విద్యార్థులు బదులిచ్చారు. స్కూలులో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది?. అమ్మా నాన్నలు ఏం చేస్తున్నారు..?. యూనిఫాం, బ్యాగ్స్ బాగున్నాయా? అని మంత్రి తదితర ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల వర్క్‌బుక్ పరిశీలించి.. చిన్నారుల హ్యాండ్ రైటింగ్ బాగుందని కితాబిచ్చారు. హ్యాండ్ రైటింగ్ మెరుగుదల కోసం కాపీరైట్ బుక్స్ రాయిస్తున్నామని ఉపాధ్యాయులు చెప్పగా.. వారిని అభినందించారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో ఇదే విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో స్థానిక ఆహారాన్ని మెనూలో చేర్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

● టీచర్లు, ఎంఈవోతో సమావేశం

తరగతి గదుల పరిశీలన అనంతరం టీచర్లు, ఎంఈఓ, స్కూలు సిబ్బందితో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ప్రభుత్వ స్కూళ్లపై అవగాహన కోసమే ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్కూలు నిర్మాణం జరిగి వందేళ్లు అయిందని టీచర్లు చెప్పగా.. మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, తామే సొంతంగా రూ.50వేలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించినట్లు ఉపాధ్యాయులు చెప్పారు. నాడు-నేడు ఫేజ్-1, ఫేజ్-2 లో తమ స్కూలుకు ఎటువంటి నిధులు విడుదల కాలేదన్నారు. వర్షం వచ్చినప్పుడు తరగతి గదుల్లోకి నీరు వస్తోందని.. మరమ్మతు లకు నిధులు విడుదల చేయాలని మంత్రిని ఉపాధ్యాయులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్రభుత్వ స్కూళ్లలో తొలుత కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, తర్వాత అన్నింటినీ ఒకేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్కూలులో హాజరు, ఫలితాలు బాగున్నాయని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. జీతం సరిగా అందడం లేదని ఆయా చెప్పగా.. ఆ సమస్య పరిష్కరించాలని ఎంఈవోను మంత్రి ఆదేశించారు.



విద్యార్థికి ప్రశ్నలు వేస్తున్న మంత్రి లోకేశ్

దర్పానికి దూరంగా..

● మంత్రి లోకేష్ పర్యటన

రణస్థలం, సెప్టెంబరు 26: సాధారణంగా మంత్రి అంటే దర్పం వేరే ఉంటుంది. వెంట యంత్రాంగం, పోలీస్ బలగాలు, భద్రతా వలయం.. ఇలా అన్ని ప్రత్యేకతలే. కానీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాత్రం ఇందుకు భిన్నం. ఎక్కడా దర్పం ప్రదర్శించకుండానే ఆయన జిల్లాలో పర్యటించడం అధికార వర్గాల్లో సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. బుధవారం ఆయన విశాఖ జిల్లాలో పర్యటించారు. సింహాచలంలో వరహా నరసింహస్వామిని దర్శించుకున్నారు. గురువారం జిల్లాలో ఆకస్మికంగా ఆయన ప్రత్యక్షమయ్యారు. ముందస్తు సమాచారం కానీ.. అధికారుల హడావుడి కానీ.. ఎమ్మెల్యేల అతికానీ ఎక్కడా కనిపించలేదు. నాడు-నేడు అసంపూర్తి నిర్మాణాలు జరిగిన రణస్థలం మండలం పాతర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఒక విద్యార్థి ప్రమాదంలో చిక్కుకుని దుర్మరణం చెందాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ తరుణంలో విశాఖ పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ స్పందించారు. విద్యాశాఖ మంత్రిగా.. నాడు-నేడు పథకం వైఫల్యాలను తెలుసుకునే పనిలో భాగంగా విశాఖ నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ఈక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు జేఆర్‌పురం జంక్షన్‌లో మంత్రి లోకేశ్‌ను కలిశారు. అయితే కేవలం రెండు నిమిషాలు మాత్రమే లోకేశ్ మాట్లాడి వెళ్లిపోయారు. గతంలో సీఎం, మంత్రుల పర్యటన సమయంలో అతిగా వ్యవహరించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రాష్ట్ర మంత్రి, ఆపై సీఎం తనయుడు సాదాసీదాగా పర్యటించడం అందర్నీ ఆకట్టుకుంటోంది.

● ప్రమాణాల మెరుగుదలకు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు కలెక్టర్ నుంచి టీచర్ వరకు అందరూ భాగస్వామ్యం వహించాలని మంత్రి లోకేశ్ కోరారు. రాబోయే ఐదేళ్లలో దేశంలోనే ఆదర్శంగా రాష్ట్ర స్కూళ్లను తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా పలు తప్పులు జరిగాయని.. ఈసారి అలాంటివి చోటుచేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా సంస్కరణలు అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులన్నింటినీ ఒకేసారి మార్చడం సాధ్యం కాదని చెప్పారు. స్కూళ్లలోని మౌలిక సదుపాయాల వాస్తవ చిత్రాలను ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డులో అప్‌లోడ్ చేయాలని ఎంఈవోను ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి నాణ్యత పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా సబ్జెక్టులవారీగా బోధనకు స్కూల్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఇటీవల వర్క్‌అడ్జెస్ట్‌మెంట్ ద్వారా కొన్నింటిని సరిచేశామని, వచ్చే ఏడాది మరింత పకడ్బందీగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఉన్నారు.



శ్రీకాకుళంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు.. వాహనదారుల ఇక్కట్లు

గురువారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)

శ్రీకాకుళం	31.75
ఎచ్చెర్ల	27.25
నరసన్నపేట	20.75
ఆమదాలవలస	19.75
సంతబొమ్మాళి	19.25
ఇచ్ఛాపురం	17.75
టెక్కలి	17.0
హిరమండలం	15.5
నందిగాం	15.0
కంచిలి	13.5
రణస్థలం	10.25

సిక్కోలులో భారీ వర్షం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. శ్రీకాకుళంలో అత్యధికంగా.. కవిటిలో అత్యల్పంగా వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలోని ఇలిసిపురం, డేఅండ్ నైట్ జంక్షన్, ఆదివారం పేట, కత్తెరవీధి.. రామలక్ష్మణ జంక్షన్‌ల వద్ద రోడ్డుపై భారీగా నీరుచేరింది. అడుగున్నర ఎత్తున వర్షపునీటితో పాటు.. మురుగునీరు ప్రవహించడంతో వాహనదారులు.. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శ్రీకాకుళంలో మురుగుకాలువలు.. ప్రజల అవస్థలను ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. ఎచ్చెర్ల, నరసన్నపేట, ఆమదాలవలస మండలాల్లో అదేరీతిన వర్షం కురిసింది. వరి పంట పొలాలు నీట మునిగాయి.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)




స్వచ్ఛ సిక్కోలు కోసం..

స్వచ్ఛ సిక్కోలు కోసం అంతా ఒక్కటయ్యారు. 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళంలోని నాగావళి నదీ తీరంలో చెత్తాచెదారాలను సేకరించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నదీ తీర పరిసరాలను శుభ్రం చేశారు. సిక్కోలును సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో సిక్కోలుకు క్లీన్‌అండ్ గ్రీన్‌లో మంచి ర్యాంకు సాధిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

- శ్రీకాకుళం అర్బన్

ఆ సన్నివేశాలు తొలగిస్తే ఓకే

• హైకోర్టుకు తెలిపిన సెన్సార్ బోర్డు



తాము సూచించిన సన్నివేశాలకు కత్తెర వేస్తే 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ బోర్డు బాంబే హైకోర్టుకు తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో పలుమార్లు విడుదల వాయిదా పడింది. దీంతో ఆమె బాంబే హైకోర్టును ఆశ్రయించగా, సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో ఈ నెల 25లోగా ఓ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, కొన్ని సన్నివేశాల్లో కట్స్‌ను సూచించిన సెన్సార్‌బోర్డ్ అందుకు అంగీకరిస్తే సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తామని కోర్టుకు నివేదించింది. దీనిపై నిర్ణయం తీసుకోవడానికి చిత్రబృందం సమయం కోరింది. దీంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 30కు వాయిదా వేసింది. ఆ లోగా ఓ నిర్ణయానికి రావాలని నిర్మాణసంస్థను ఆదేశించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం, ఎమర్జెన్సీ నాటి సంఘటనల నేపథ్యంలో 'ఎమర్జెన్సీ' తెరకెక్కింది. కంగన ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

జస్ట్ ఆస్కింగ్.. అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. వివిధ అంశాలపై స్పందిస్తూ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ ప్రశ్నలు సంధిస్తుంటారు. తిరుమల లడ్డు వివాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య మూడు రోజుల క్రితం మొదలైన ట్వీట్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రకాశ్‌రాజ్ పోస్టులపై పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేయడమే కాకుండా సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని మీడియా సమావేశంలో హెచ్చరించడంతో ఈ ట్వీట్ల అటాక్ మొదలైంది. 'నేను విదేశాల్లో ఉన్నా.. ఇండియా వచ్చిన తర్వాత మీ ప్రశ్నలకు సమాధానం చెబుతా' అని ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. అంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అందరూ భావించారు. కానీ ప్రకాశ్‌రాజ్ ఊరుకోలేదు. తమిళ హీరో కార్తీ లడ్డు వ్యవహారంపై క్షమాపణ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ 'చేయని తప్పునకు క్షమాపణలు చెప్పించుకోవడంలో ఆనందం ఏమిటో.. జస్ట్ ఆస్కింగ్' అంటూనే వ్యంగ్య బాణం వదిలారు. అయితే ఈ ట్వీట్‌పై పవన్‌కల్యాణ్ స్పందించలేదు. ఆయన మౌనంగా ఉన్నా ఊరుకోకుండా గురువారం మరో ట్వీట్ బాణం వదిలారు ప్రకాశ్‌రాజ్. 'గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక మరో అవతారం .. ఏమిటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం.. జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో ప్రశ్నించారు. ప్రకాశ్‌రాజ్ పెట్టిన ఈ ట్వీట్ పై నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు.



ఉత్సవంలా సాగే పాట

శంకర్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వాణీ కథానాయిక. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి రెండో గీతాన్ని ఈ నెల 30న విడుదల చేయనున్నారు. గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్, సంగీత దర్శకుడు తమన్ ఈ పాట చిత్రీకరణకు సంబంధించిన విశేషాలను పంచుకున్నారు. శంకర్ మాట్లాడుతూ 'ఈ పాట చిత్రీకరణ కోసం చాలా పరిశోధన చేశాం. దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన నృత్యరీతులను పాటలో భాగం చేశాం. ఒక ఉత్సవంలా ఈ పాట సాగుతుంది. రామ్‌చరణ్ అద్భుతంగా నర్తించారు' అని చెప్పారు. తమన్ మాట్లాడుతూ "రా మచ్చా... పాటలో విభిన్న సంస్కృతులను చూపించబోతున్నాం. పాటను తెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.



టాలీవుడ్ అగ్ర దర్శకులు రాజమౌళి, సుకుమార్ అనూహ్య కలయిక అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్టూడియోలో 'పుష్ప2' చిత్రీకరణ జరుగుతోంది. మహేశ్‌బాబుతో తాను చేయబోయే సినిమా పనుల కోసం రాజమౌళి కూడా అదే స్టూడియోకు వెళ్లారు. అక్కడ వారిద్దరు కలుసుకున్నారు.

ఆకట్టుకునే అలియా పోరాటం



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'జిగ్రా'. వాసన్ బాలా దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించారు. అలియాభట్ సోదరుడి పాత్రలో వేదాంగ్ రైనా నటించాడు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. చిత్రబృందం గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. హంతక ముఠాల నుంచి తమ్ముణ్ణి కాపాడుకునేందుకు అక్క చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. యాక్షన్ సన్నివేశాల్లో అలియా నటన ఆకట్టుకుంది.

మనసుకి హత్తుకొనే తల్లి కథ



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఆశీస్సులతో ఆయన తనయుడు కిశోర్ చిత్రనిర్మాణరంగంలోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న 'తల్లి మనసు' చిత్ర షూటింగ్ పార్ట్ పూర్తయింది. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన తారాగణం. ఈ సినిమాతో వి.శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ముత్యాల కిశోర్ మాట్లాడుతూ 'సినిమా ప్రారంభోత్సవం నాడు సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని చెప్పినట్టే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేసి వర్క్ పూర్తి చేశాం. మంచి కథ, కథనాలు సినిమాకు ప్రధాన బలం. అందుకు తగ్గ ఆర్టిస్టులు దొరికారు. వారందరి సహకారంతో మనసు కట్టి పడేసే అద్భుత చిత్రంగా రూపుదిద్దుకుంది. నాన్నగారి పర్యవేక్షణలో దర్శకుడు చక్కగా సినిమా తీశారు. తొలి ప్రయత్నంలోనే ఒక మంచి సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. వాస్తవిక జీవితానికి అద్దం పట్టే విధంగా 'తల్లి మనసు' ఉంటుందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని ముత్యాల సుబ్బయ్య చెప్పారు.



యాభై సెకన్ల యాడ్‌కు రూ. ఐదు కోట్లా!?

కాలం కలసి రావాలే కానీ సినిమా తారలకు ఇప్పుడు రెండు చేతులా సంపాదనే!. అయితే సినిమా షూటింగ్ లేకపోతే యాడ్ షూటింగ్ అన్నట్లుగా ఉంది కొంతమంది తారల బిజీ షెడ్యూల్. రెండు చోట్లా మంచి డబ్బు వస్తుండడంతో మరింత హుషారుగా పని చేస్తున్నారు. ఒక సినిమా కోసం మూడు, నాలుగు నెలలు కష్టపడితే వచ్చే పారితోషికం కంటే ఒక నిముషం పాటు కనిపించే యాడ్ ఫిల్మ్ సంపాదనే ఎక్కువగా ఉండడంతో తెలుగులోనూ చాలా మంది తారలు ఇప్పుడు యాడ్ ఫిల్మ్‌లో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అందరి కంటే ఒక అడుగు ముందుకు వేసి యాభై సెకన్ల యాడ్ ఫిల్మ్‌లో నటించినందుకు అక్షరాలా రూ. ఐదు కోట్లు వసూలు చేసి వార్తల్లో నిలిచారు నయనతార. ఇంతకుముందు నయనతార పారితోషికం రూ. ఐదు కోట్లే ఉండేది. కానీ హిందీ చిత్రం 'జవాన్' సూపర్ హిట్ అయిన తర్వాత అమాంతం తన పారితోషికాన్ని పది కోట్ల రూపాయలకు నయనతార పెంచేసిందని నిర్మాతలు చెబుతున్నారు. అంటే సౌత్‌లో నే అత్యధిక పారితోషికం తీసుకొనే హీరోయిన్ నయనతారే అన్నమాట. ఇప్పుడు యాడ్ ఫిల్మ్స్‌తోనూ ఆమె మోత మోగిస్తోంది. ప్రస్తుతం నయనతార తన భర్త విఘ్నేశ్, కవల పిల్లలతో గ్రీస్‌లో జాలీగా విహరిస్తోంది.

అక్టోబర్‌లో గ్యాంగ్‌స్టర్



మాఫియా ముఠాల మధ్య ఆధిపత్య పోరును సరికొత్తగా వెండితెరపై ఆవిష్కరించిన పలు చిత్రాలు విజయం అందుకున్నాయి. ఇప్పుడు ఇదే తరహా కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. చంద్రశేఖర్ రాథోడ్, కాశ్వీ కాంచన్ జంటగా నటిస్తున్నారు. చంద్రశేఖర్ రాథోడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 25న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రచయిత సాయిమాధవ్ బుర్రా చేతుల మీదుగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకలను ఆకట్టుకునేలా ఉంటుందనీ, కథలోని మలుపులు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చంద్రశేఖర్ రాథోడ్ తెలిపారు.

మా మనవడినీ ఆదరించండి


- పరుచూరి బ్రదర్స్



సుదర్శన్ పరుచూరి హీరోగా పరిచమయవుతున్న 'మిస్టర్ సెలబ్రిటీ' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్. పాండురంగారావు నిర్మించారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నాజర్, రఘుబాబు ఇతర ముఖ్య పాత్రధారులు. ఈ సినిమా రిలీజ్ పోస్టర్‌ను పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేసి 'మమ్మల్ని ఆదరించినట్లుగానే మా మనవడు సుదర్శన్‌ను ఆదరించాలని కోరుతున్నా. కొత్త దర్శకుడైనా రవికిశోర్ సినిమా బాగా తీశాడు' అని అభినందించారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'మమ్మల్ని నలభై ఏళ్లుగా ఆదరిస్తున్నారు. మా మనవడు సుదర్శన్ 'మిస్టర్ సెలబ్రిటీ' హీరోగా మీ ముందుకు వస్తున్నాడు. తనని ఆశీర్వదించి, సినిమాను హిట్ చేయండి' అని కోరారు.

అప్‌డేట్స్

మాస్ లుక్‌తో



యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'పొట్టేల్'. దసరాకు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నటుడు అజయ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఆయన లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. మాస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు అజయ్. సాహిత్ మోత్ఖూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కె, సురేశ్ కుమార్ సడిగె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: మోనిష్ భూపతి రాజు



ఆంధ్ర వర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులు. ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ సహకారంతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నారు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 40 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు ఏడాదికి రూ.55,000.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో క్రిటికల్ కేర్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు 15 చొప్పున మొత్తం 45 సీట్లు ఉన్నాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ టెక్నాలజీ స్పెషలైజేషన్ ఎంచుకున్నవారికి ప్రోగ్రామ్ ఫీజు రూ.40,000. మిగిలిన స్పెషలైజేషన్‌లకు ప్రోగ్రామ్ ఫీజు రూ.60,000.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీఎస్సీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వయసు:** దరఖాస్తు నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 16
- **క్యాంపస్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, కిమ్స్-ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్, షీలానగర్, విశాఖపట్నం-532003
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం - 530003
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

దిక్సూచి

ఐఐఎఫ్‌టీలో
పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 5
- వెబ్‌సైట్: www.iift.ac.in





బారువ తీరాన 2016లో జరిగిన మహోదయంలో భక్తుల రద్దీ

విశాల తీరం.. అపార వనరులు

జిల్లాలో నదీ, సాగర తీరంలో ఆలయాలు, బౌద్ధక్షేత్రాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. విశాల తీరం, అపార వనరులు పర్యాటక అభివృద్ధికి దోహదపడుతున్నాయి. అరసవల్లి, ముఖలింగం, ఎండలమల్లి ఖార్జున స్వామి వంటి ఆలయాల వల్ల ఆధ్యాత్మిక పరంగా ప్రాధాన్యత నెలకొంది. శాలిహుండాం, దంతపురిలో బౌద్ధక్షేత్రాల వల్ల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈనేపథ్యంలో ఏటా వేలాది దేశ, విదేశీ పర్యాటకులు ఇక్కడ ఆధ్యాత్మిక, పురాతన ప్రాంతాలను సందర్శిస్తున్నారు. దీనికితోడు వంశధార, నాగావళి నదులకు ఆనుకుని ఆలయాలు పచ్చని పంట పొలాలతో ప్రకృతి అందాలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. శుక్రవారం పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక కథనం.

పిక్నిక్‌లతో సందడి

టెక్కలి: సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు తీరం నిత్యం సందర్శకులతో రద్దీగా ఉంటోంది. ఇక్కడ పిక్నిక్‌ల సీజన్‌లో సందడిగా వాతావరణం కనిపిస్తుంది. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివస్తారు. సువిశాల తీరం, సరుగుడు, జీడిమొక్కల తోటలు, ఇసుక దిబ్బలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ రిసార్ట్, రెస్టారెంట్స్, ఫుడ్ ప్లాజాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని పర్యాటకులు చెబుతున్నారు.



విదేశీ విహంగాలు

- జిల్లాలో ఆధ్యాత్మికం, పురాతన ప్రాంతాలకు ప్రాధాన్యం
- ఏటా వేలాది మంది సందర్శకుల రాక
- పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం

ప్రాచీన ఆలయాలు.. ఇసుక తిన్నెలు

సోంపేట: బారువతీరం పర్యాటకపరంగా ఎంతగానో ప్రాముఖ్యత పొందింది. బారువ సముద్ర తీరానికి సమీప గ్రామాల నుంచే కాకుండా ఒడిశా, పశ్చిమబెంగాల్ నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకంలో బారువకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. సువిశాలమైన తీర ప్రాంతంలో దేశంలోనే ఎత్తైన ఇసుక తిన్నెలు ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడి తీరంలో నిర్మించిన లైట్‌హౌస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. లైట్‌హౌస్ పైకెక్కి ఎంతో ఆహ్లాదాన్ని పొందుతున్నారు. ఆ పక్కన ఉన్న కాటేజీలు సైతం పర్యాటకులకు ఆకట్టుకుంటాయి. జిల్లా కేంద్రం శ్రీకాకుళం నుంచి ఈ బీచ్‌కు సుమారు 110 కిలోమీటర్లు ఉంటుంది. నిత్యమూ ఈ ప్రాంతానికి చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్ అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన హోటల్ స్టార్‌హోటల్‌ను తలపిస్తోంది.

చారిత్రక ఆలయాలు..


పవిత్రమైన నదీసాగర సంగమానికే కాకుండా బారువ తీరం ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధిగాంచింది. పాండవుల కాలంలో ప్రసిద్ధిగాంచిన కోటిలింగేశ్వర ఆలయం, జగన్నాథస్వామి ఆలయం ఇక్కడి ప్రత్యేకత. ముఖ్యంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన కోటిలింగేశ్వరాలయం, పురాతన జగన్నాథస్వామి ఆలయాలతోపాటు విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణ దేవరాయులు దర్శించిన జనార్దన స్వామి ఆలయం ఇక్కడ ఉన్నాయి. వీటితోపాటు బీచ్ రోడ్డులో కనక దుర్గ ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది.

నదీసంగంలో స్నానం ఎంతో పుణ్యం..

పూర్వం పంచపాండవులు మహేంద్రగిరుల్లో అరణ్యవాసం చేస్తున్న సమయంలో అనుకోకుండా అర్జునుడు వదిలిన బాణం తగిలి గోవు మృతిచెందింది. ఆ గోవు గర్భం నుంచి రాలిన ఒకటి తక్కువ కోటి రక్తపు చుక్కలే బారువ ప్రదేశంలో పడి శివలింగాలుగా ఏర్పడ్డాయని, అదే బారువలో కోటిలింగేశ్వరాలయంగా పేరుగాంచింది. గోహత్య అనంతరం తీవ్ర మనస్థాపానికి గురైన అర్జునుడు శ్రీకృష్ణుడిని వేడుకున్నాడు. బహుళ చతుర్థి శ్రవణ నక్షత్రం తిథి కలిసిన రోజున నదీ, సాగర సంగమంలో స్నానమాచరించి, ఆ ముక్కోటిని దర్శించుకుంటే చేసిన పాపం హరించుకుపోవడమే కాకుండా జన్మ రాహిత్యం పొందుతారని తెలియజేశాడు. దీంతో అర్జునిడితో సహా పాండవులు బారువతీరంలో సముద్ర స్నానమాచరించి, కోటిలింగేశ్వరాలయాన్ని దర్శించారని స్థానికుల నమ్మకం. దీంతో ప్రతిఏటా రథసప్తమి పర్వదినంతోపాటు దశాబ్దాలకొకసారి వచ్చే మహోదయం (బుడ్డు)రోజున భక్తులు బారువతీరంలో సముద్ర స్నానాలు చేసి, ఇక్కడి ప్రాచీన ఆలయాలను దర్శించుకుంటారు.



దంతపురిలో శిథిలావస్థలో ఉన్న బుద్ధుని విగ్రహం



శ్రీముఖలింగేశ్వరాలయం

శ్రీముఖలింగం.. ఆధ్యాత్మిక కేంద్రం

జలుమూరు: శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వరాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. శ్రీకాకుళానికి 50 కిలోమీటర్లు ఉంది. 11వ శతాబ్దకాలంలో గంగ వంశీయులు నిర్మించారు. తర్వాత కాలంలో వంశ పారంపర్యంగా పర్లాకిమిడి రాజుల చేతిలోకి వెళ్లింది. ముఖలింగంలో ఎక్కడ తవ్వకాలు జరిపినా లింగాలు బయటపడతాయి. ఇక్కడ కోటికి ఒక్క లింగం తక్కువగా ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. దీంతో దక్షిణ కాశీగా ప్రఖ్యాతి చెందింది. కాగా పర్యాటకశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పర్యాటకులకు సౌకర్యాలు కొరవడ్డాయి.

చారిత్రక సంపద.. దంతపురి క్షేత్రం

సరుబుజ్జిలి: బుద్ధుడి కాలం నాటి ఎన్నో గుర్తులకు నిలయం దంతపురి క్షేత్రం. పర్యాటకంగా ఈ క్షేత్రం జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందింది. ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో దంతపురి క్షేత్రం ఉంది. సరుబుజ్జిలి మండలం రొట్టవలస, కొండవలస, పెద్దపాలెం, పాలవలస, రావివలస గ్రామాల మధ్య 175 ఎకరాల్లో విస్తరించి ఉంది. క్రీస్తుపూర్వం 261లో అశోక చక్రవర్తి చేసిన కళింగ యుద్ధం తర్వాత ఈ క్షేత్రం ప్రాచుర్యంలోకి వచ్చినట్టు చరిత్ర చెబుతోంది. దంతపురి వంశానికి రాజైన కళింగ ఖారవేలుని కాలంలో ప్రాముఖ్యత సంతరించుకుంది. కళింగ రాజులు రాజధానిగా దంతపురి విశిష్టస్థానం ఉంది. పురావస్తుశాఖాధికారులు 30 ఏళ్ల కిందట చేపట్టిన తవ్వకాల్లో దంతపురి ఆనవాళ్లు బయటపడ్డాయి. ఇక్కడ 37 ప్రాకారాలు, కోటకు నలు దిక్కులా ద్వారాలు ఉండేవని గుర్తించారు. ఈ తవ్వకాల్లో మూడు స్థూపాలు, గుర్తించలేని పాతతరం విగ్రహాలు, స్నానపు గదులు, నీటి నిల్వ జార్లు, ప్లవర్ వైద్యులు వంటపాత్రలు, దీపాలు, భోజనపు గిన్నెలు, రుబ్బురోలు, ఎముకతో చేసిన దువ్వెనలు, టెర్రకోట వస్తువులు బయటపడ్డాయి.కాగా టీడీపీ ప్రభుత్వ పాలనలో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించి.. బుద్ధుడి విగ్రహ ఏర్పాటుతో పాటు ప్రతి ఏడాది బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించేవారు. బీహార్‌లోని బుద్ధగయ, దక్షిణాఫ్రికా తదితర దేశాల నుంచి బౌద్ధ సన్యాసులు వచ్చి ఈ ప్రాంతమంతా పర్యాటకులతో కళకళలాడేది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దంతపురి క్షేత్రం పూర్తిగా విస్మరించడంతో ఇక్కడ ఆనాటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి.

పొన్నాడ కొండపై పర్యాటక శోభ

ఎచ్చెర్ల: జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న పొన్నాడ కొండపై పర్యాటక శోభ సంతరించుకుంటోంది. ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ కొండ శ్రీకాకుళం నగరానికి అత్యంత సమీపంలో ఉంది. 1999లో పొన్నాడ కొండను పర్యాటక కేంద్రం అభివృద్ధి చేసేందుకు అప్పటి పర్యాటక శాఖ మంత్రి గౌతు శివాజీ తొలుత ప్రతిపాదించారు. ఆ తర్వాత శ్రీకాకుళానికి పొన్నాడను కలుపుతూ నాగావళి నదిపై వంతెన నిర్మించడంతో ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. పొన్నాడలో సర్వే నెంబర్ 86లో 58.80 ఎకరాలు కొండ విస్తరించి ఉంది. ఇందులో ఐదెకరాలు ఇస్కాన్ మందిరానికి, 9.75 ఎకరాలు శిల్పారామానికి, పర్యాటక శాఖకు 17 ఎకరాలు, ఎస్‌టీపీకి, అంబేద్కర్ శిక్షణ అకాడమీకి ఐదెకరాలు చొప్పున, పొన్నాడ పాత ఎత్తిపోతల పథకానికి 25 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఇస్కాన్ మందిరం (జగన్నాథ మందిరం) తాత్కాలికంగా నిర్మించారు. శిల్పారామం నిర్మాణానికి కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తిచేశారు. పొన్నాడ కొండ పర్యాటక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు కోరుతున్నారు.

పచ్చని పంట పొలాలు.. ప్రకృతి అందాలు

గార: శాలిహుండం బౌద్ధ క్షేత్రం సందర్శకులను ఆకర్షిస్తోంది. ఈ క్షేత్రానికి ఒక వైపు గల గల పారుతున్న వంశధార, మరో వైపు పచ్చని పంట పొలాలతో ప్రకృతి అందాలు సందర్శకులను కనువిందుచేస్తోంది. బుద్ధుని కాలం నాటిదిగా చరిత్రకారులు చెపుతున్న ఈ బౌద్ధక్షేత్రం గార మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఉంది. ఇక్కడ బౌద్ధుల కాలం నాటి స్థూపం, ఆనాటి చరిత్రకు సాక్షిగా స్థూపాలు, చైత్యాలు, ప్రాకారాలు ఉన్నాయి. ఇక్కడకు తరచూ టిబెట్, భూటాన్ తదితర ప్రాంతాలు నుంచి బౌద్ధులు వచ్చి ప్రార్థనలు చేస్తుంటారు. 1965లో జరిపిన పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన బుద్ధుని కాలం నాటి శిలా ప్రతిమలు, విగ్రహాలు, రాతి అవశేషాలు, ఇక్కడే ఏర్పాటు చేసిన మ్యూజియంలో భద్రపరిచారు. కేంద్ర పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉన్న ఈ బౌద్ధక్షేత్రం వద్ద నిరంతరం పర్యవేక్షించే గార్డులను నియమించారు. కార్తీకమాసంలో ఇక్కడ జిల్లా వివిధ ప్రాంతాలకు చెందిన వారు కుటుంబాలతో తరలి వచ్చి పిక్నిక్‌లు నిర్వహించుకుంటారు.

ఎయిర్‌పోర్టుకు స్థల పరిశీలన

హరిపురం: ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మఖరజోల రఘునాథపురం, మాల గోవిందపురంతోపాటు బిడిమి ప్రాంతంలోని భూములను గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. మఖరజోల సమీపంలో పవర్‌గ్రిడ్ ఎలక్ట్రికల్ లైన్ గ్యాస్ పైపులైన్ ఉండడంతో ఆటంకం ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టుకు అనువుగా ఉండేందుకు సుమారు వెయ్యి ఎకరాలు భూమి అవసమరని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందని, అనువైన భూమి లభ్యమైతే తదుపరి చర్యలు ప్రారంభిస్తామని చెప్పారు. ఆయన వెంట పలాస ఆర్డీవో భరత్‌నాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణమూర్తి, వీఆర్వో హేమరాజు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పాతపట్నం: పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గురువారం ఆర్‌ఎల్‌పురంలో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకుడు మంచు కరుణాకరరావు,సీడి పశువైద్యాధికారి శ్రీవాణి పాల్గొన్నారు.

'ప్రసాదం' నిధుల మంజూరుకు కృషి

జలుమూరు: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సాయంతో ముఖలింగేశ్వరాలయం అభివృద్ధికి ప్రసాదం పథకం కింద నిధులు మంజూరు చేయించి దేశంలో గుర్తింపు పొందేలా ఆలయాన్ని తీర్చిదిద్దుతానని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం శ్రీముఖలింగేశ్వరాలయ మాఢ వీధులు నిర్మాణానికి, సీసీరోడ్లు నిర్మాణ అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. కాగా శ్రీముఖలింగేశ్వరస్వామిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ టి.సతీష్, టీడీపీ నాయకులు మెండ రాంబాబు, బగ్గు గోవిందరావు, కింజరాపు సత్యం పాల్గొన్నారు.

గనుల శాఖ ఏడీగా విజయలక్ష్మి

టెక్కలి: గనులశాఖ సహాయ సంచాలకురాలిగా విజయలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె హెడ్‌క్వార్టర్స్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

తిలారు రైల్వేగేటు మధ్యలో నిలిచిన గూడ్స్‌రైలు

జలుమూరు: తిలారు రైల్వేగేటు మధ్యలో గూడ్స్ రైలు సాంకేతిక లోపం వల్ల గురువారం నిలిచిపోవడంతో వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు. ఆమదాలవలస నుంచి పలాస వైపు వెళ్తున్న గూడ్స్ రైలు 11 గంటల సమయంలో 15 నిమిషాలపాటు గేటు మధ్యలో నిలిచిపోయింది. ఆమదాలవలస నుంచి తిలారు వచ్చే రైలు పట్టాలు అప్ కావడం, వర్షానికి పట్టాలు తడిసి గూడ్స్‌రైలు అదనపు లోడు వల్ల ఇంజన్ లాగక గేటు మధ్యలో నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రైలును ముందుకు నడిపించారు గూడ్స్ రైలు నిలిచిపోవడం వల్ల వాహనాలు రాకపోకలకు అంతరాయం కలగడంతో గేటుకు ఇరువైపుల బారులుతీరాయి. గూడ్స్ రైలు ముందుకు సాగ డంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌పై ఫిర్యాదు

జలుమూరు: ఏపీ సమగ్రశిక్ష ఈనెల 23న విడుదలచేసిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలు భర్తీ నోటిఫికేషన్‌పై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఢిల్లీలో ఫిర్యాదు చేసినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కమిషన్ విచారణ జరిపించి నోటిఫికేషన్ రద్దుచేసి రాజ్యాంగబద్ధంగా ఆదివాసులకు రావాల్సిన ఉద్యోగాలు కేటాయించి న్యాయంచేయాలని కోరినట్లు తెలిపారు.

బాబూరావును అభినందించిన ముఖ్యమంత్రి

పలాస:రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీడీపీ నాయకుడు వజ్జబాబూరావును సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. బుధవారం రాత్రి విజయవాడలో ఆయన్ను బాబూరావు కలుసుకున్నారు.

గోవుల రక్షణకు ఉద్యమించాలి

హిరమండలం: గోవుల రక్షణకు ఉద్యమించాలని ఏపీగోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ కోరారు. గురువారం స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమంలో గో ప్రేమికుల సమావేశంలో నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బుచ్చిబాబు, పాతపట్నం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చారి సలాన శరత్‌కుమార్, కోరాడ వెంకటరమణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి ఖ్యాతిని ఇనుమడింపజేస్తాం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఖ్యాతిని ఇనుమడింపజేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు తెలిపారు. కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడుతూ కొత్తమ్మతల్లి ఉత్సవాలు మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబరు ఒకటి నుంచి మూడో తేదీ వరకూ వైభవంగా నిర్వహించేదుకు సమీక్షించినట్లు చెప్పారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

వజ్రపుకొత్తూరు: భోగాపురం ఎయిర్ పోర్టు ఆరునెలలు ముందుగానే పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు, స్థల పరిశీలన కూడా జరుగు తుందన్నారు. గురువారం మంచినీళ్లపేటలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పూర్తి చేసి జిల్లాలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా వెనుకబడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పలాస ఆర్డీవో భరత్‌నాయక్, మండల ప్రత్యేకాధికారి ఎం.రవికృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు


లావేరు: బెజ్జిపురంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

చంద్రబాబుతోనే సంక్షేమం

కొత్తూరు: సంక్షోభం సమయంలోనూ సంక్షేమం అందించడం చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఇరపాడు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బిట్-3 గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు, అగతముడి మాధవరావు, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు

● **పాతపట్నం:** రాష్ట్రంలో ఎన్డీఏ నేతృత్వంలో సుస్థిరపాలన సాగుతోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. రౌతులక్ష్మీపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పైల బాబ్జీ, అంపోలు మధు, సైలాడ సతీష్ పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన

గార: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ప్రజలకు సంతృప్తికరమైన పాలన అందించడం జరిగిందని ఎమెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం తోణంగిలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలను కలిసి వందరోజుల పాలనపై కరపత్రాలు, స్టిక్కర్లు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

కవిటి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గురువారం కవిటిలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద రోజుల పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీమోహన్, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నేతలు బి.రమేష్, ఎ.మధు, బి.కామరాజు, సర్పంచ్ పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వ్యవస్థలను చిన్నాభిన్నం చేసిన జగన్

ఆమదాలవలస: అన్ని వ్యవస్థలను మాజీ సీఎం జగన్ చిన్నాభిన్నం చేశారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం 13వ వార్డులో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇది మా మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సంపతిరావు మురళీధరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూన అప్పలనాయుడు, బి.గౌరీపతి పాల్గొన్నారు.

● **బూర్జ:** రాష్ట్ర సంక్షోభంలోనూ సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పాలవలస గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి రవికుమార్ కరపత్రాలు అందించారు. అనంతరం పాలవలస హైస్కూల్‌లో మొక్కలు నాటారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం పరిశీలించారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మాజీ జడ్పీటీసీ, ఏపీ మార్కెట్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, ఎంపీడీవో తిరుపతిరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

లావేరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం బెజ్జిపురంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి వివరించారు. కూటమి నాయకులు సురేష్, శ్రీనివాసరావు, మధుబాబు, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● **రణస్థలం:** ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసే ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని, 100 రోజుల పాలనలో ప్రజలను అన్ని విధాలుగా సంతృప్తి పరిచామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. గురువారం జేఆర్ పురం పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, పిషని జగన్నాథంనాయుడు, పిన్నింటి భానూజీనాయుడు, వడ్డాది శ్రీనివాసరావు, నారాయశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: ఇరపాడులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


కవిటి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


ఆమదాలవలస: పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి

పాతపట్నం: భగంతర గ్రామానికి చెందిన వండ్రాడ రాజు(32) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రాజు బుధవారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో మూత్రవిసర్జనకు పెరటిలోకి వెళ్లి తిరిగి ఇంట్లో వస్తున్నాడు. ఆ సమయంలో ఇంటికి వంటపాకకు మధ్యలో ఉన్న వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆటోలో పాతపట్నం సామాజిక ఆసుపత్రికు తరలించారు. అప్పటి రాజు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. రాజు ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజు భార్య రజని గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదుచేశారు.


రాజు(ఫైల్)

బాలికపై అత్యాచారం.. కేసు నమోదు

జలుమూరు (సారవకోట): సారవకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఆ బాలిక 9వ తరగతి చదువుతుంది. బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడినట్టు బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కుక్కలదాడి.. 20 మందికి గాయాలు

పోలాకి: కుసుమపోలవలసలో వీధికుక్కల దాడిలో 20 మందికి తీవ్రగాయాలయ్యాయని సర్పంచ్ తర్ర లక్ష్మీనారాయణ తెలిపారు. క్షతగాత్రులను నరసన్నపేట వైద్యశాలకు తరలించినట్టు చెప్పారు. గాయపడినవారిలో బెవర అచ్చుతరావు, బి.ప్రవంతి, కొయ్యాన నర్సింహమూర్తి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

ఇంట్లో చోరీ యత్నం

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న ఎంఐజీ-51 నెంబరు గల ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. తలుపులు పగలు గొట్టి ఇంట్లోకి వెళ్లిన దొంగలకు ఆ ఇంట్లో కనీసం కుర్చీలు కూడా లేకపోవడం చూసి ఖాళీ చేతులతో వెళ్లిపోయారు. ఆ ఇంట్లో నివసిస్తున్న నిర్మల అనే మహిళ సత్యసాయి డివోటీ, ఆమెకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండడంతో ఇంట్లో ఎటువంటి సామగ్రి ఉంచలేదు. కాగా ఘటనా స్థలాన్ని వన్‌టౌన్ పోలీసులు, క్లూస్ టీం పరిశీలించి, ఎటువంటి నష్టం జరగలేదని గుర్తించారు. దీనిపై బాధితురాలు కూడా ఫిర్యాదు చేయలేదు.

సారా ప్యాకెట్లు పట్టివేత

కంచిలి: అక్రమంగా తరలిస్తున్న 40 లీటర్ల సారా ప్యాకెట్లు పట్టుకున్నట్టు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. గురువారం జక్కర గ్రామానికి చెందిన డి.అనిల్ అనే వ్యక్తి రెండు బెలూన్స్‌లో రూ.12వేలు విలువ గల 40 లీటర్ల సారా ప్యాకెట్లను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్టు తెలిపారు.

గ్రానైట్ లారీకి ప్రమాదం

టెక్కలి: లంకపాడు రోడ్డు సమీపంలో టెక్కలి నుంచి మెళియాపుట్టి వైపు వెళ్తున్న ఓ గ్రానైట్ లారీ గురువారం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురైంది. దీంతో లారీపై ఉన్న గ్రానైట్ బ్లాకులు కిందపడ్డాయి. అయితే ఈ వాహనం విజయనగరం జిల్లా ముచ్చెర్ల నుంచి మెళియాపుట్టి మండలం దీనబంధుపురం కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్‌కు వెళ్తున్నట్టు తెలుస్తోంది. గ్రానైట్ వాహనంతో కలిపి 55 టన్నులు బరువు ఉండాల్సి ఉన్నప్పటికీ సుమారు 75 టన్నులు బరువు ఉన్నట్లు సమాచారం.


ప్రమాదానికి గురైన గ్రానైట్ లారీ

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

శ్రీకాకుళం అర్బన్: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది తదితరులు 32 మంది తమ సమస్యలు ఎస్పీకి విన్నవించుకున్నారు. ఆయా వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

ఉద్యోగ భర్తీలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

అరసవల్లి: ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష ఈ నెల 27న నోటిఫికేషన్ విడుదల చేసిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ భర్తీలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి అన్నారు. ఈ నోటిఫికేషన్‌లో టీచింగ్ పోస్టులు మొత్తం 507 ఉండగా, ఆదివాసులకు కేవలం 10 పోస్టులు మాత్రమే కేటాయించారని, రాజ్యాంగ ప్రకారం ఆరు శాతం రిజర్వేషన్ కేటాయించాల్సి ఉందన్నారు. అలాగే నాన్ టీచింగ్ పోస్టులు 97 ఉండగా, ఒక్క పోస్టు కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వండి

అరసవల్లి: రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రమాదంలో పదో తరగతి విద్యార్థి కృష్ణంరాజు మృతి చెందిన దుర్ఘటనపై తక్షణ నివేదిక అందించాలని కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడం, విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి ఉంటే ఇలా ప్రాణాలు గాలిలో కలిసిపోయి ఉండేవి కావన్నారు. జిల్లాలో ఇలా భద్రతా పరంగా గోడలు లేని పాఠశాలలు ఎన్ని ఉన్నాయో ప్రతిపాదనలు ఇస్తే, చర్యలకు సిఫారసులు చేస్తామన్నారు.

రవాణా కార్మికుల జాతీయ ఉపాధ్యక్షుడిగా దామోదరరావు

అరసవల్లి: బెంగళూరులో జరిగిన 18వ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ జాతీయ మహాసభలో, ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావును జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే జాతీయ కార్యదర్శిగా జీవీ నర్సయ్య నియమితులయ్యారు. వీరి నియామకంపై ఈయూ జిల్లా చీఫ్ అడ్వైజర్ కొర్లాం గణేష్, అప్పారావు, జిల్లా, డిపో కమిటీలు శుభాకాంక్షలు తెలిపారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు శుభరాట

ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామంలో దుర్గాదేవి దసరా నవరాత్రి ఉత్సవాల శుభరాట గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. వేదపండితులు నీలగిరి రామకృష్ణ సిద్ధాంతి పూజలు నిర్వహించి శుభరాట వేశారు. గత 22 ఏళ్లగా దసరా నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నామని నర్తు ప్రేంకుమార్ తెలిపారు. కమిటీ సభ్యులు సంతోష్, రాము, రాజు, గిరి, జగదీష్, గోపాల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులదే బాధ్యత

పొందూరు: మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ పైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాలకుల అశ్రద్ధ వల్లే వెనుకబాటు

పలాస: పాలకుల అశ్రద్ధ వల్లే ఉత్తరాంధ్ర జిల్లాలు వెనుకబాటుకు గురయ్యాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ఆరోపించారు. గురువారం పలాసలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయలేదని ఆరోపించారు. ఈనెల 29న టెక్కలి అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వీరాస్వామి, వినోద్‌కుమార్, భీమారావు, రామారావు, కుమార్ పాల్గొన్నారు.

కాకినాడ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

నందిగాం: వైద్యుడు ఉమామహేశ్వరరావుపై దాడిచేసిన కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీపై చర్యలు తీసుకోవాలని ఎస్సీసెల్ మండల కో-ఆర్డినేటర్ ఎ.సురేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసభ్యకరంగా మాట్లాడి కించపరిచేలా మాట్లాడడం తగదని హితవుపలికారు.

ఖైదీలకు న్యాయపరమైన సేవలు

గుజరాతీపేట: జిల్లా కేంద్ర కారాగారంలో వివిధ కారణాలతో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు న్యాయపరమైన సేవలు అందిస్తామని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. గురువారం జిల్లా కారాగారంలోని ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎటువంటి న్యాయపరమైన సలహాలు, సూచనలు కావాలన్నా సేవలు అందిస్తామన్నారు. ఖైదీల పరిస్థితి, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి మౌలానా

లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

రణస్థలం: జిల్లాలో గురువారం మంత్రి లోకేష్ ఆకస్మికంగా పర్యటించారు. జిల్లా కేంద్రంలోని పాఠశాలను తనిఖీచేసి, విద్యార్థులతో కొంత సమయం ము చ్చటించి తిరిగి విశాఖ వెళ్తున్న లోకేష్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రామతీర్థం జంక్షన్ వద్ద కలిసి ముచ్చటించారు.


లోకేషను కలిసిన ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

గుజరాతీపేట: జాతీయస్థాయి ఖోఖో సబ్ జూనియర్ పోటీలకు ఇచ్ఛాపురం డొంకూరులో చదువుతున్న ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి చిట్టి ఫల్గుణరావు తెలియజేశారు. ఎంపికైన దున్న రవి, ఎర్ర భవానీ ఈ నెల 28వ తేదీ నుంచి జార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. సంఘ ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, చిట్టి నాగభూషణం సాధు శ్రీనివాసరావు వారిని అభినందించారు.

ఫెన్సింగ్ పోటీలకు గొల్లలవలస విద్యార్థులు

పోలాకి: గొల్లలవలస ఉన్నతపాఠశాల విద్యార్థులు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడల పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వై.రమణమ్మ, పీఈటీ డి.భవానీ తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో టి.ద్రాక్షాయని, ఎల్.మాధవి, డి.కుశల్‌కుమార్, యు.నవీన్, పి.మధుసూర్యనారాయణ ఎంపికైనట్టు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

హిరమండలం: పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థికి అండగా నిలిచారు. 1986-93లో హిరమండలంలో తమతో చదువుకున్న వైశ్యరాజు సుదర్శన్ రాజు కేన్సర్ బారిన పడి విశాఖలోని చికిత్సపొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వారణాసి రాజారెడ్డి తన పూర్వ మిత్రులకు సమస్యను తెలియజేశాడు. దీంతో వారంతా గురువారం రూ.60 వేలు అందజేశారు.

● **సంతబొమ్మాళి:** బోరుభద్ర గ్రామానికి చెందిన ఇప్పిలి త్రినాథ్ ప్రమాదంలో గాయపడడంతో వైద్య ఖర్చులు నిమిత్తం శివశక్తి యూత్ రూ.13 వేలు గురువారం అందజేశారు. ఇటీవల హరిశ్చంద్రపురం వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన విషయం విదితమే.

వంశధారను ఇచ్ఛాపురం వరకు పొడిగించాలి

హరిపురం: వంశధార కాలువను ఇచ్ఛాపురం వరకు పొడిగించి రైతులను ఆదుకోవాలని పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షులు మామిడి మాధవరావు కోరారు. గురువారం హరిపురంలోని మార్పు ట్రస్ట్ భవనంలో నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రైతు సంఘ ప్రతినిధులు తామాడ త్రిలోచన, పుచ్చ దుర్యోధన, దాసరి శ్రీరాములు, నారయణ, గున్న శ్రీను, మజ్జి బాబూరావు, నల్ల హడ్డీ, సోమనాధం, బాబూరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పలాస రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల డీఎల్‌పీవో వెంకటరమణ కోరారు. గురువారం కిష్టుపురంలో వీధుల్లో పరిసరాలను పరిశుభ్రం చేయడంతో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు, కార్యదర్శులు సద్గుణరాజు, లండ శ్రీధర్ పాల్గొన్నారు.

30 మంది రక్తదానం

నరసన్నపేట: మండలం రెడ్డికపేటలో జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల పురస్కరించుకుని 30 మంది అభిమానులు గురువారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో గామానికి ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు కుమార్ స్వామి, రవి, వైద్యఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జైలుకు టీవీల వితరణ

గార: అంపోలు సమీపంలోని జిల్లా జైలుకు విశాఖకు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కీర్తి పట్నాయక్ సూపరింటెండెంట్ సన్యాసిరావుకు రెండు కలర్ టీవీలు అందజేశారు. జైలర్ ఉదయ్ భాస్కర్, డిప్యూటీ జైలర్ రామకృష్ణ, లక్ష్మణరావు, ఇస్కాన్ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కవిటి: ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయాల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పి. అశోక్ కోరారు. ఈమేరకు గురువారం విశాఖపట్నంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పాటు

కవిటి: కవిటిలో మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ గురువారం ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా బాగా వేణు, ప్రధాన కార్యదర్శిగా మద్దిలి కేశవరావు, ఉపాధ్యక్షులుగా జి.లింగరాజు, బలగ ధర్మారావు, పి.కేశవరావు, పి.కుమార్, సహాయ కార్యదర్శులుగా డి.ధర్మారావు, ఎం.సుధాకర్, డి. జీవన్, గౌరవాధ్యక్షుడిగా డి వాసు ఎన్నికయ్యారు.

రూ.25లక్షల పరిహారం ఇవ్వాలి

అరసవల్లి: రణస్థలం మండలంలో పాతర్లపల్లి పాఠశాల భవనం సన్‌షేడ్ కూలిపోయిన ఘటనలో మృతి చెందిన పదో తరగతి విద్యార్థి కృష్ణంరాజు కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో గాయపడి శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థి కోరాడ శ్రీరామ్‌ను గురువారం వారు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావుతో కలిసి పరామర్శించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలి

ఆమదాలవలస: తిరుమల పవిత్రతను, లడ్డు విశిష్టతను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపవిత్రం చేయడంతో ఆ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో గల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ఎంపీ మృతికి సంతాపం

ఆమదాలవలస: ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి సంతాపం తెలియజేశారు. మంచి ఆత్మీయురాలిని కోల్పోయానని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సత్యవతి కోరారు.

క్షేత్రస్థాయి ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలి

సరుబుజ్జిలి: క్షేత్రస్థాయి ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో పీవీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జె.ఆనందరావు, మండల పరిషత్ ఏవో ప్రసాదరావు, నందివాడ రమణబాబు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచే జీవో విడుదలచేయాలి

లావేరు: కార్మికులకు కూలీ రేట్లు పెంచే జీవో విడుదల చేయాలని సివిల్ సప్లై హమాలీలు కోరారు. ఈ మేరకు లావేరు సివిల్ సప్లై గోదాం వద్ద గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులను నిర్వహించారు.


నిరసన తెలుపుతున్న హమాలీలు

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

నందిగాం: పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధనలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని హరిదాసుపురం మాజీసర్పంచ్ మాదిన లోకనాథం తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం హెచ్ఎం చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

కంచిలి: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సోంపేట సీఐ బి.మంగరాజు కోరారు. గురువారం రాత్రి కంచిలి రైల్వే స్టేషన్ ఆవరణలో యువకులు, ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కల్పించారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్లను గురువారం రాత్రి ప్రభుత్వం బదిలీ చేసింది. అలాగే శిక్షణ పూర్తి చేసుకున్న డిప్యూటీ కలెక్టర్లకు ఆర్డీవోలుగా పోస్టింగ్ ఇస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా పీడీసీ శిక్షణ పూర్తి చేసిన కె.సాయిప్రత్యూషను శ్రీకాకుళం ఆర్డీవోగా నియమించారు. ఇదివరకు ఉన్న ఆర్డీవో సీహెచ్ రంగయ్యను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వంశధార ప్రాజెక్టు యూనిట్-4లో ప్రత్యేక ఉప కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లెల వెంకట సత్యసాయి రామ్మోహన్‌రావును బొబ్బిలి ఆర్డీవోగా బదిలీ అయింది. అలాగే పీడీసీ శిక్షణ పూర్తి చేసిన మడక కృష్ణమూర్తిని టెక్కలి ఆర్డీవోగా నియమించారు. రాజమండ్రిలో టూరిజం విభాగంలో రీజనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.స్వామినాయుడును పలాస ఆర్డీవోగా బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేసిన భరత్ నాయక్‌ను పత్తికొండకు బదిలీ అయింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల: చిలకపాలెం 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా కొయ్యాం, ధర్మవరం, పొన్నాడ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం, కొయ్యాం, కేకే నాయుడుపేట, డి.మత్స్యలేశం, కుప్పిలి, బడివానిపేట, నిమ్మవానిపేట భగీరథపురం, పొన్నాడ, ముద్దాడ గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

● **సోంపేట:** కొర్లాం పరిధిలోని మామిడిపల్లి ఫీడర్‌లో కొమ్మలు తొలగించనున్నందు ఉన్న మామిడిపల్లి, టి.శాసనాం, గొల్లవూరు, ఉప్పలాం, సిరిమామిడి, ఎర్రముక్కాం, రాణిగాం, బట్టిగళ్లూరు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యోగేశ్వరరావు కోరారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

● **ఇచ్ఛాపురం:** విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం రత్తకన్న, మండపల్లి, మశాఖపురం, జగన్నాథపురం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ యోగేశ్వరరావు తెలిపారు.

● **టెక్కలి:** టెక్కలి పంచాయతీ పరిధి 11కేవీ టౌన్‌ఫీడర్ వార్షిక మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆదీఆంధ్రావీధి, బ్రాహ్మణవీధి, మెట్టవీధి, మండాపొలం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో కోరారు.

● **మందస:** మందస సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ మేఘవూల ఫీడరు వద్ద జంగిల్ క్లియరెన్స్ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇచ్ఛాపురం: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: పారా లీగల్ వలంటీర్ల పోస్టులకు టెన్త్ ఉత్తీర్ణులైన వారినుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి ఫరీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, కవిటి మండలాల పరిధిలో పనిచేయుటకు ఆసక్తిగల వారు వచ్చే నెల 8వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. వీరికి ఎటువంటి జీతం ఉండదని, స్వచ్ఛందంగా పనిచేయుటకు ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 7893002368 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు

అరసవల్లి: పట్టణ స్వయం సహాయక సంఘాల ఆర్థిక తోడ్పాటుకు మెప్మా అర్బన్ మార్కెట్లను నిర్వహిస్తున్నట్టు మెప్మా పీడీ ఎస్వీ రమణ తెలిపారు. గురువారం స్థానిక రైతు బజారు సమీపంలో నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌ను ఆయన సందర్శించారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసి, వారిలో నైపుణ్యాన్ని, పోటీ తత్వాన్ని పెంపొందించనున్నట్టు తెలిపారు.

స్వచ్ఛ నగరాల జాబితాలో సిక్కోలును చేరుద్దాం

శ్రీకాకుళం అర్బన్: దేశంలో స్వచ్ఛ నగరాల జాబితాలో సిక్కోలు ఉండాలన్న లక్ష్యంతో అందరూ సమష్టిగా పనిచేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న నాగావళి నదీ తీరంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లతో పాటు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ నది తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. నదులు దైవాలతో సమానమని జిల్లాలో ఉన్న నదుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. నాగావళి నది ప్రవహించే ఒడ్డున సుందరమైన పార్కులు, చక్కని రహదారి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నగరం నుంచి వచ్చే మురుగు శుభ్రపరిచి నాగావళి నదిలోకి విడిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యర్థాలు నదిలో వెయొద్దని, శానిటేషన్ సిబ్బందికి అందించాలన్నారు. సుందర శ్రీకాకుళం కోసం అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు చేస్తు న్నామన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రివర్వ్యూ పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఉమా మహేశ్వరరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, టీడీపీ నాయకులు మాదారపు వెంకటేష్, పీఎంజే బాబు, ఇప్పిలి తిరుమలరావు, శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు. కాగా ఆ ప్రాంతంలో చెత్త వేయొద్దంటూ తమ చేతులతో గోడలకు రంగులు అద్దారు.


వ్యర్థాలు తొలగిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు